సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 28 । నవంబర్ । 2023



పేటలో ఐటీ దాడులు

నారాయణపేటలో అధికార పార్టీ నేతల ఇళ్లలో ఐటీ అధికారులు దాడులు చేశారు.

వివరాలు 6లో ▸



కార్తీక శోభ..

జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో సోమవారం కార్తీక శోభను సంతరించుకున్నాయి.

వివరాలు 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.2 /21.8

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పోలింగ్‌కు ముందు రోజున, పోలింగ్ రోజున పత్రికల్లో ప్రచురితమయ్యే అన్ని రాజకీయ ప్రకటనలకు జిల్లా స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసే చివరి సమయంలో ఇచ్చే ప్రకటనల కారణంగా తప్పుదోవ పట్టించే లేదా అభ్యంతరకర ప్రకటనల వల్ల అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఇబ్బందులు పడకుండా గతంలో చోటు చేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘంపై ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు ఈనెల 29, పోలింగ్ రోజైన 30వ తేదీ ప్రింట్ మీడియాలో ప్రచురించే అన్ని రాజకీయ ప్రకటనల అంశాలను జిల్లా స్థాయి ఎంసీఎంసీ ముందస్తు అనుమతి తప్పనిసరి చేసినట్లు వెల్లడించారు. ఇందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ పూర్తి అప్రమత్తంగా ఉండి అనుమతికి దరఖాస్తులు వచ్చినప్పుడు తక్షణమే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తం



మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన బందోబస్తు విధులపై ఎస్పీ హర్షవర్ధన్ సోమవారం రాత్రి యూపీఎస్‌పీ బలగాలకు జడ్చర్ల డీటీసీలో సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి అన్ని రకాల విధులలో స్థానిక పోలీసులతో కలిసి విధులు నిర్వహించాలన్నారు. ఈనెల 28నుంచి డిసెంబర్ 1వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నియంత్రించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఓటర్లకు భయాందోళన కలగకుండా, ఓటరు తన ఓటు హక్కును స్వేచ్ఛగా వేయడానికి భరోసా కల్పించేలా విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితిల్లో హాజరుకావాల్సిన సిబ్బంది ప్రత్యేక నిఘాతో విధులు నిర్వహించాలన్నారు. కీలకమైన పోలింగ్‌కేంద్రాల వద్ద యూపీ బలగాలు అధికంగా ఉంటారని తెలిపారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, యూపీఎస్‌పీ కమాండెంట్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి 144 సెక్షన్

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి డిసెంబర్ 1ఉదయం 7గంటల వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా, పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5గంటల తర్వాత ఏ రాజకీయ పార్టీ కూడా ప్రచారం చేయరాదని, జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ప్రదర్శించరాదని పేర్కొన్నారు. మైక్‌లు, లౌడ్‌స్పీకర్లు, రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదని తెలిపారు. జిల్లాలో ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపుగా తిరగరాదని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు.





కోస్గిలో బహిరంగసభకు హాజరైన జనం

కేసీఆర్ పని దోచుకోవడం.. దాచుకోవడమే

కోస్గి, గద్వాల బహిరంగసభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ

- ప్రాణాల విలువ తెలిసే సోనియా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ, నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలు కోల్పోయారు
- రాష్ట్రంలో ప్రజలు పేదలుగానే ఉన్నారు.. కేసీఆర్ కుటుంబం మాత్రం రూ.కోట్లకు పగడలెత్తింది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. మాఫియారాజ్యాన్ని తరిమికొడతాం

కోస్గి/గద్వాల రూరల్: 'ఆనాడు దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ.. నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో యువకులు, ప్రజలు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.. ఆ కుటుంబాల బాధ, మనిషి ప్రాణం విలువ తెలిసిన వ్యక్తిగా తన తల్లి సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది.. కానీ, ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ దోచుకోవడం, దాచుకోవడమే చేశార'ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కోస్గి, గద్వాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారని ఆశించి.. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, అతని కుటుంబమే బాగుపడి రూ.లక్షల కోట్లు దోచుకొని విలాసవంతమైన జీవితం గడుతున్నారని, పేదలు మాత్రం మరింత పేదలుగా మారారని దుయ్యబట్టారు. మొదటిసారి రేవంత్‌రెడ్డి నన్ను కలిసినప్పుడు ఎలాంటి పదవి అడగలేదని, గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజల కోసం తాను చేస్తున్న పోరాటం వివరించి.. రాష్ట్రంలో మార్పు కోసం, ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం మాత్రమే ఇవ్వాలని కోరారన్నారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలపై ప్రేమాభిమానాలు ఉన్నాయని, ప్రజలకు సైతం రేవంత్ అంటే ఎంతో ప్రేమ ఉందనే విషయం తమకు తెలుసు అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, ఉపాధి అవకాశాలు లేక యువత ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే పనిని మాత్రమే చెబుతుందని, ఇందుకు నిదర్శనమే కర్ణాటకలో అమలు చేస్తున్న హామీలు అని పేర్కొన్నారు. రాజస్తాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సైతం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసి అన్నివర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. తెలంగాణలో సైతం అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి జిల్లాకు ఒక ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తామన్నారు. దేశంలో సచివాలయానికి రాకుండా పదేళ్లు పాలించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

వందశాతం అమలు చేస్తాం..

కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయని, వాటిని కూడా వందశాతం పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రియాంకాగాంధీ చెప్పారు. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంట్లో అర్హులైన ఇద్దరు వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పింఛన్ పథకాలు అమలు చేస్తామన్నారు. గద్వాలలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చేనేత పార్కు ఏర్పాటు చేసి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కోస్గి సభలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, పరిగి, తాండూరు అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్, యూసుబ్, పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాయకులు కిష్టప్ప, నరేందర్, హరి, భీంరెడ్డి, రాఘవరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి సభ సైడ్‌లైట్స్

- ప్రియాంకాగాంధీ 4 గంటలకు సభావేదికపైకి చేరుకున్నారు.
- మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రియాంకాగాంధీకి పరిచయం చేస్తూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అని తెలిపారు.
- ప్రియాంకాగాంధీ ఏకధాటిగా 47 నిమిషాల పాటు ప్రసంగించారు.
- ముందుగా జైబోలో తెలంగాణ, మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామికి జై, రేణుక ఎల్లమ్మజీకి జై అంటూ ప్రజలచేత జేజేలు పలికించారు.
- ప్రియాంకాగాంధీ రేవంత్‌రెడ్డి పేరు చెప్పగానే పెద్దఎత్తున అరుపులు, కేకలతో ప్రజలు నినాదాలు చేశారు.
- 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ సభకు వచ్చిన జనంతో ప్రియాంకాగాంధీ అనిపించారు.
- సభ ముగియగానే రేవంత్‌రెడ్డి పేరుతో వచ్చిన డీజే పాటకు జనం కేరింతలతో డ్యాన్స్ చేశారు. దీంతో వేదికపై ఉన్న ప్రియాంక సైతం చప్పట్లు కొడుతూ సభికులను ఉత్సాహపరిచారు.



అభివాదం చేస్తున్న ప్రియాంకాగాంధీ, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే

రాష్ట్రంలో మాఫియాల రాజ్యం

రాష్ట్రంలో ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ఎన్నో చట్ట విరుద్ధ పనులతో దొరల పాలన సాగుతుందని విమర్శించారు. దోచుకున్న డబ్బుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి అధికారంలోకి వస్తామన్న ధీమాలో కేసీఆర్ ఉన్నారని, మా నానమ్మ ఇందిరమ్మ చెప్పిన విషయం బాగా గుర్తుందని, ప్రజాస్వామ్యంలో ప్రజలే శక్తివంతులని, వారు అనుకుంటే ఏ శక్తి తట్టుకోలేదని, ఇదే నమ్మకంతో మీ ముందుకు వస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డితో పాటు నేను కూడా వేదికపై నిలబడి ఉన్నామని, మాకు ఇతర ధర్మాలు లేవని, సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వస్తున్నామని, ప్రజలు జాగ్రత్తమై అన్ని విధాలుగా ఆలోచించి పనిచేయని వారికి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ మాఫియా, శ్యాండ్, వైన్ మాఫియాల భరతం పడతామని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ రేవంత్ పాటకు చప్పట్లతో ప్రజలను ఉత్తేజపరిచారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల డీఎన్‌ఏ ఒక్కటే

- కుల, మత రాజకీయాలు తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచనలు లేవు
- మహబూబ్‌నగర్‌లో వారి ఆటలు సాగనివ్వం
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు సమాజాన్ని విడదీసే కుట్ర చేస్తున్నారని, వారిద్దరి డీఎన్‌ఏ ఒక్కటేనని మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో న్యూటౌన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ ఆస్తులు సంపాదించిన రేవంత్‌రెడ్డి అన్నదమ్ముళ్ల పరిస్థితి చూస్తే దొంగేదొంగ అన్నట్లుగా ఉందన్నారు. రేవంత్ పోటీ చేసిన స్థానాల్లో గెలిచే ప్రసక్తే లేదన్నారు. తాను మర్రిచెట్టు లాంటి వాడినని చెప్పుకోవడానికి రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గతంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మతం పేరుతో ప్రజలను విడదీస్తే వారిని కలిపేందుకు తనకు పదేళ్లు పట్టిందన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ మూడు, నాలుగు సీట్లు గెలిచే పరిస్థితి లేదన్నారు. బీసీని సీఎం చేస్తామని, ఇక్కడికొచ్చి ఒక బీసీని అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇండియా, పాకిస్తాన్ సెంటిమెంట్‌తో గెలిచిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సరిగ్గా నెల రోజుల కింద బీజేపీలో చేరికల కమిటీకి ఉపాధ్యక్షుడిగా ఉండి కాంగ్రెస్ పార్టీలో రాత్రికి రాత్రే చేరిపోయారని ఎద్దేవా చేశారు. ఆనాడు మతం పేరుతో పాలమూరులో చిచ్చుపెట్టి గెలిచారని ఆరోపించారు. చట్టపరంగా కేసులు తప్పవని, మత కలహాలు, భూ ఆక్రమణలు లేకుండా మహబూబ్‌నగర్ ప్రజలు స్వేచ్ఛగా బతుకుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. తండ్రి లాంటి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటుకు ఓటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ అని, తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేసేందుకు కుట్రలు చేసిన రేవంత్‌ను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి పాడపాటి చంద్రశేఖర్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పి.చంద్రశేఖర్

ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూరు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలను సోమవారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్ర పరిశీలించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం పీయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ భవనం, స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్‌లో టేబుల్లు, అభ్యర్థుల ఏజెంట్లు, అధికారులు, సిబ్బంది వచ్చేందుకు దారులు, ఇతర అన్ని ఏర్పాట్లను పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పోలింగ్ రోజున, ముందు చేయాల్సిన పనులపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీసీ నిర్వహించారు. పోలింగ్ రోజు, ముందు నిర్వహించే విధులలో సెక్టోరల్ అధికారులు చాలా ముఖ్యమైన వారని, వారి ఫోన్ నంబర్లు రిటర్నింగ్ అధికారులు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారులతో ముందే ప్రత్యక్షంగా మాట్లాడడమే కాకుండా వారికి తెలిసి ఉండాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఇచ్చే పోలింగ్ శాతం విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితులలో తేడాలు రావద్దని, చివరగా ఇచ్చే పోలింగ్ శాతంపై పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలతోపాటు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో సౌకర్యాలపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలని, కమ్యూనికేషన్ ప్లాన్, ఓటర్లకు సౌకర్యాలు, చేయాల్సినవి, చేయకూడని పనులు తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున, ముందు రోజు ఏదైనా ఎన్నికలకు సంబంధించి తప్పు సమాచారం వచ్చినట్లయితే వెంటనే సరైన సమాచారం ఇచ్చే విధంగా ఫిర్యాదుల పరిష్కారం, సోషల్ మీడియా విభాగాలు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ వీసీలో డిప్యూటీ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్ మాట్లాడుతూ ఈవీఎంల థర్డ్ ర్యాండమైజేషన్, మాక్ పోలింగ్, మరిన్ని ఎన్నికల ప్రవర్తన నియమావళి బృందాలను ఏర్పాటు చేయడం, ఫిర్యాదులు జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించడం, పోస్టల్ బ్యాలెట్ తయారీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్ పార్టీల ఏర్పాటు తదితర అంశాలపై వివిధ సూచనలు ఇచ్చారు. కలెక్టర్ రవినాయక్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర రిటర్నింగ్ అధికారులు అనిల్ కుమార్, మోహన్ రావు, నటరాజ్ హాజరయ్యారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను సరిచూసుకోండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పోలింగ్ కేంద్రాలలో మరోసారి ఫర్నీచర్, వెబ్ కాస్టింగ్, ఇతర సౌకర్యాలు సరిచూసుకోవాలని కలెక్టర్ రవినాయక్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలింగ్ ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీసీ నిర్వహించారు. అన్ని కేంద్రాల లోపల, బయట శానిటేషన్ చేయించాలని, శుభ్రంగా ఉంచాలని, మరోసారి ర్యాంపులు, వీల్ చైర్లు తనిఖీ చేసుకోవాలని, తప్పనిసరిగా టాయిలెట్లు, తాగునీటిని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ఎలాంటి రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదన్నారు. అన్నిచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు అనిల్ కుమార్, మోహన్‌రావు, నటరాజ్‌తో పాటు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

30న సెలవు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: శాసనసభ ఎన్నికలకు ఈనెల 30న పోలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, సాధారణ ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొని ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసీఆర్ పాలనపై విసుగు



దేవరకద్రలో జరిగిన సకల జనుల విజయసంకల్ప సభలో ప్రసంగిస్తున్న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ

- తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చేస్తాం
- అసోం సీఎం హిమంత బిశ్వశర్మ

దేవరకద్ర: 'తెలంగాణలో బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు.. రజాకార్ల పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.. ఇక బీఆర్ఎస్‌ను ఇంటికి పంపే సమయం వచ్చింది.. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం ఖాయం.. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణకు బీసీ సీఎంను చేస్తామ'ని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ అన్నారు. సోమవారం దేవరకద్రలో బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో లీటర్ పెట్రోల్ ధర రూ.110, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రాజస్థాన్‌లో రూ.109 ఉంటే.. బీజేపీ అధికారంలో ఉన్న అసోం, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్‌లో రూ.98లే ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజల నడ్డి విరిచి పన్నులు వసూలు చేసి దోపిడీ చేస్తుందని ఆరోపించారు. బీజేపీ వస్తే ధాన్యం మద్దతు ధర రూ.3,100, ఏడాదికి 4 సిలిండర్లు ఉచితంగా ఇస్తుందని, పుట్టిన ఆడబిడ్డ పేరిట రూ.2 లక్షలు బ్యాంకులో జమ చేస్తామన్నారు. రామమందిరం ఉచిత దర్శనం కల్పిస్తామన, దళితుల సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. దేశంలో అందరు సమానం అని ఆడపిల్లలకు ఆస్తిలో హక్కు కల్పించే దిశగా చట్టం తేవడానికి బీజేపీ సమాయత్తం అయిందన్నారు. రాహుల్‌గాంధీ ఆరు గ్యారంటీలు ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందని, అధికారంలో లేకుండా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కర్ణాటకలో ఇచ్చిన గ్యారంటీలు ఇంకా అమలు చేయని అసమర్థ పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు ఒకటే అని వారి మాటలు నమ్మవద్దని, నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీని గెలిపిస్తే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. దేవరకద్రలో ప్రశాంత్‌రెడ్డిని గెలిపిస్తే వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మోసం చేసే పార్టీలను నమ్మొద్దు

ప్రజలను మోసం చేసే పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మవద్దని దేవరకద్ర బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి నోటుకు ఓటు కేసులో ఇరుక్కున్న వ్యక్తి అని, ఇటీవల పార్టీ టికెట్లు సైతం అమ్ముకున్నాడని, సీఎం అయి రూ.లక్ష కోట్లు సంపాదించాలని ఆశ పడుతున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం రూ.లక్షల కోట్లు అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. సమావేశంలో డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, పద్మజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భరత్, రవీందర్‌రెడ్డి, నంబిరాజు, రమేశ్, కొండ విజయలక్ష్మి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజాసింగ్

- కేసీఆర్ అవినీతిని ఎండగట్టి ప్రజల ముందు నిలబెడతాం
- బంగారు తెలంగాణకు బదులు అప్పుల కుప్పగా మార్చారు
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

- వివరాలు 6లో..



గడియారం చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన బీజేపీ శ్రేణులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ఇవ్వాలి

కేసీఆర్ అవినీతిని ఎండగట్టి ప్రజల ముందు నిలబెడతాం

- బంగారు తెలంగాణకు బదులు అప్పుల కుప్పగా మార్చారు
- రాష్ట్రంలో రామరాజ్య స్థాపనకు కలిసిరావాలి
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

పాలమూరు/అమరచింత: స్థంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇంటికి పంపించి రిటైర్మెంట్ ఇవ్వాలని బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి జిల్లా అమరచింతలో బీజేపీ అభ్యర్థులు ఏపీ మిథున్‌రెడ్డి, జలంధర్‌రెడ్డిలకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పదేళ్లకాలంలో బంగారు తెలంగాణ బదులు అప్పుల తెలంగాణగా మార్చారని, మన కడుపులో ఉన్న బిడ్డ మీద కూడా రూ.1.25 లక్షల అప్పు పెట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్షల కోట్లు కమీషన్ల రూపంలో దండుకున్నారని, కానీ, ప్రాజెక్టు మాత్రం నీట మునిగిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడితే కవిత లిక్కర్ దందాలో జైలుకు వెళ్లనుందన్నారు. నిరుద్యోగులు బలిదానంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం పదవులను దక్కించుకొని సంపాదనే ధ్యేయంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నిత్యం మద్యం మత్తులో ఊగిసలాడే సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తానే నడిపించానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యం మత్తులో ఇంట్లో పడుకోవడంతోనే సమయాన్ని గడిపాడని, ఎందరో మేధావులు తమ శక్తిమేరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తే కేసీఆర్ అదంతా తన క్రెడిట్ అని చెప్పుకొని అధికారం దక్కించుకున్నాడన్నారు.


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న రాజాసింగ్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటే..

రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేయడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెరవెనుక ఒప్పందంతో ఎన్నికల బరిలో నిలిచాయని రాజాసింగ్ ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తీవ్రవాదం పెరిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే పరోక్ష కారణమన్నారు. దేశంలో హిందు రాజ్య స్థాపనను అడ్డుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఖతం కాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాలమూరు మరో పాతబస్తీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ రాష్ట్రం పూర్తిగా అప్పుల పాలైందని, ఇక్కడ ఇచ్చిన గ్యారంటీలకు కూడా ఏమాత్రం గ్యారంటీ లేదన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇల్లు బాగుపడుతుందన్నారు. ఆయా సభల్లో కర్ణాటక కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ నేతలు కొండయ్య, కృష్ణానాయక్, కృష్ణవర్ధన్ రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, యాదయ్య, బుచ్చిరెడ్డి, వేణమ్మ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

తెలంగాణలో బుల్డోజర్ బాధ్యత తీసుకుంటా

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి..బీసీ ముఖ్యమంత్రి అయిన తర్వాత తాను బుల్డోజర్ బాధ్యత తీసుకుని బీఆర్ఎస్ పాలకులు చేసిన అవినీతి, భూ కబ్జాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఎంఐఎం చేతుల్లో కారు స్టీరింగ్ పెట్టారని, ఈ ఎన్నికల్లో ప్రజలు కారుకు ఓటు వేస్తే పాతబస్తీ నేతల చేతుల్లో పాలన ఉంటుందన్నారు. మత విద్వేశాలను రగిల్చి రాష్ట్రంలో హిందు ముస్లింల మధ్య అల్లర్లను సృష్టించి పబ్బం గడుపుకొనేందుకే ఓవైసీ సోదరులు రాజకీయ ముసుగు కప్పుకున్నారని ఆరోపించారు.


రాజాసింగ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

బీసీని సీఎం చేస్తాం..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ ఈ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాడని, కానీ నరేంద్రమోదీ చెప్పిన మాటకు కట్టుబడి బీసీని ముఖ్యమంత్రి చేస్తారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని డిక్లేర్ చేసిన తర్వాత కేసీఆర్ కింద మంట మండుతుందన్నారు. పాలమూరులో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి బంగారు పాలమూరుగా అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడానికి ప్రతి కార్యకర్త టెక్నాలజీతో యుద్ధం చేసి పాలమూరులో మిథున్‌రెడ్డిని, మక్తల్‌లో జలంధర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

ఐటీ దాడులతో కలకలం

- 14 గంటలు దాటిన కొనసాగిన తనిఖీలు

నారాయణపేట: ఎన్నికల వేళ నారాయణపేటలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులపై సోమవారం తెల్లవారుజాము నుంచి ఐటీ అధికారులు దాడులు చేపట్టడంతో పట్టణంలో కలకలం రేపినట్లయింది. మరో మూడు రోజుల్లో పోలింగ్ జరగనున్న సమయంలో నారాయణపేటలో ముగ్గురు బీఆర్ఎస్ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ దాడుల వెనక కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందా.. లేక బీఆర్ఎస్ కుట్ర చేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సంబంధించిన వ్యక్తులతో ముందు నుంచి ఆయనకు సత్సంబంధాలు ఉండటం.. అధికార పార్టీకి దగ్గర ఉంటూ.. కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరో వ్యాపారి కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇచ్చి ఉంటాడనే నేపథ్యం.. రిటైర్డ్ ప్రిన్సిపల్ చిట్టెం కుటుంబానికి విశ్వాసపాత్రుడు కావడంతో ఈ దాడులు అధికార పార్టీ నుంచే ఎవరో ఒకరు ఐటీ శాఖకు ఫిర్యాదు చేసి ఉండవచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అసలు రహస్యం ఏమిటో..?

పేట నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ నెలకొనేది. అయితే ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం సరైంది కాదని కొంతమంది యువకులు పార్టీని వీడి.. గ్రూపు తగాదాలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో బీజేపీనే ఒకవేళ ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చి బుక్ చేసి ఉండొచ్చు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ ఐటీ దాడుల వెనక అసలు రహస్యం ఏమిటనేది తెలియాల్సి ఉంది.

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే



గండీడ్: వచ్చేది సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని సల్కర్‌పేట్, రంగారెడ్డిపల్లి, జానంపల్లి, గోవింద్‌పల్లి, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు తగిన న్యాయం చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, వైస్ఎంపీపీ ఈశ్వర్, రాంరెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, శైలజా ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు

కోయిల్‌కొండ: కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని మల్కాపూర్, దమాయపల్లి, కోయిల్‌కొండ, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కోయిల్‌కొండ చౌరస్తాలో రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. బహుజనులంతా ఏకమై గడీల పాలనకు స్వస్తి పలకాలని వారు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, రవీందర్, సుధాకర్‌రెడ్డి, బండియాదవ్‌కుమార్, రామస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బీడీ కార్మికులకు అండగా కాంగ్రెస్


భూత్పూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న


కురుమూర్తిలో ఆరు గ్యారెంటీల అమలు పత్రంతో ప్రమాణం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట/అడ్డాకుల/దేవరకద్ర/మదనాపురం/భూత్పూర్/కొత్తకోట: బీడీ కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీడీ ఫ్యాక్టరీ యాజమానుల ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సమ్మేళనం నిర్వహించారు. గత కాంగ్రెస్ పార్టీ పాలనలో బీడీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ కార్మికులకు ఫించన్లు, ఇళ్ల నిర్మాణంతోపాటు వైద్య సేవలకు ఆర్థిక సాయాన్ని అందించిందన్నారు. అధికారంలోకి వస్తే కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి హరీష్ రావు దిష్టి బొమ్మను దహనం చేశారు. బీడీ ఫ్యాక్టరీల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడి పాలనకు చరమగీతం పాడాలి..

రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. అడ్డాకులలో సోమవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్‌పై ప్రజలు తిరగబడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇసుక, మట్టిదందాతో రూ.కోట్లు కూడగట్టారని విమర్శించారు. రైతు బంధు రాకుండా బీఆర్ఎస్ పార్టే అడ్డుకున్నదని ఆరోపించారు.

దాడి అమానుషం..

అలంపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ ఇంటిపై రౌడీ మూకలు దాడి చేసి ఇంట్లో ఉన్న ఆయన భార్య మహాలక్ష్మిపై దాడి చేయడం అమానుషం అని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తీవ్రంగా ఖండించారు. సోమవారం దేవరకద్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలంపూర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.

మదనాపురం మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని నాయకులు ప్రచారం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని సోమవారం కురుమూర్తి స్వామి సన్నిద్ధిలో ప్రమాణ పత్రం రాశారు. ప్రమాణం చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

తీన్మార్ మల్లన్న సోమవారం రాత్రి భూత్పూర్ చౌరస్తాలో రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. కొత్తకోట పట్టణ కేంద్రంలో దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డితో కలిసి తీన్మార్ మల్లన్న రోడ్‌షో నిర్వహించారు.

మద్యం దుకాణం సీజ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని న్యూబాలాజీ మద్యం దుకాణాన్ని ఆదివారం రాత్రి ఎన్నికల వ్యయ పరిశీలకుడు, ఐఆర్ఎస్ అధికారి కుందన్‌యాదవ్ తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎక్కువ మొత్తంలో మద్యం విక్రయించినట్లు గుర్తించారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఈఎస్ సైదులు, సీఐ వీరారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ మద్యం దుకాణంలో స్టాక్ పరిశీలించి సీజ్ చేశారు. సదరు దుకాణాదారుడి లైసెన్స్ రద్దు చేశారు. దుకాణంలో రూ.8లక్షల విలువగల స్టాక్ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రెండు రోజుల కిందట జహంగీర్ అనే వ్యక్తి రూ.2లక్షల విలువగల మద్యాన్ని ఆటోలో తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్/అడ్డాకుల/మదనాపురం: ఆశీర్వదించి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు మూడోసారి కూడా ఆశీర్వదించాలన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని సీఎంగా చేయాలన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సర్పంచ్ సంధ్య నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, భీంరెడ్డి, బాలమణెమ్మ తదితరులు ఉన్నారు. మూసాపేటకు చెందిన డీసీఎం అసోసియేషన్, రజక సంఘం తదితరులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. చక్రాపూర్ కాంగ్రెస్ నాయకులు ఆల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, కొండయ్య, జమీర్, రవీందర్‌గౌడ్, మదీనా ఆబిద్, రాజేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు. మదనాపురం మండల కేంద్రంలో ఎంపీపీ పద్మావతి, మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు జయంతమ్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆలవెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం చిన్నచింతకుంట మండలంలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆల సతీమణి మంజుల ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు


జడ్చర్ల పట్టణంలో..


జిల్లాకేంద్రంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు


కందూర్ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో..

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జడ్చర్ల పట్టణంలోని సంతోషిమాత, వాసవికన్యకాపరమేశ్వరి, భాగ్యేశ్వరాలయం, సత్యనారాయణస్వామి ఆలయాల్లో లక్ష దీపార్చన, గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. నవాబుపేట పరిధిలోని అన్ని గ్రామాల్లో వేడుకలు జరిగాయి. అడ్డాకుల మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో, మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపారాధన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కొత్తగంజ్ శ్రీనృసింహస్వామి, ద్వారకామాయిబాబా మందిరం, పరమళగిరిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి.


జిల్లాకేంద్రం భగీరథ కాలనీలో

ఎన్నికల సిత్రాలు..

దండాలమ్మ..



చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లో దేవరకద్ర బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. - దేవరకద్ర

బస్తాలు మోస్తాం.. ఓట్లు రాబడతాం..



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో కొల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి తరఫున స్థానిక నాయకులు వినూత్నంగా ప్రచారం నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. - పాన్‌గల్

కాగడాల వెలుగులో..



నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌లోని తెలకపల్లి మండలం తాళ్లపల్లిలో ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వెళ్లగా.. గ్రామస్తులు కాగడాలతో ఘనస్వాగతం పలికారు. - తెలకపల్లి

చిన్నారితో సరదాగా..



చిన్నచింతకుంట మండలం గూడూర్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టిన కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి ఓ చిన్నారిని ఎత్తుకొని లాలించడం అందరినీ ఆకట్టుకుంది. - చిన్నచింతకుంట

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత


చంద్రశేఖర్(ఫైల్)

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని మనికొండలో పెండెం చంద్రశేఖర్(49) విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు ఆదివారం ఉదయం తన ఇంట్లో స్విచ్ బోర్డు వద్ద ఆన్‌ఆఫ్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు సర్పంచ్ గంగాపురి తెలియజేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకొని పేద కుటుంబానికి అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కారు బోల్తా: ఒకరి మృతి


ప్రమాదానికి గురైన కారు

అడ్డాకుల: కర్నూల్ జిల్లాకు చెందిన రామయ్య(80) తన సోదరుడు, మరో డ్రైవర్‌తో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. శాఖాపూర్ దాటిన తర్వాత పాత రోడ్డు సమీపంలో కారుకు అడ్డుగా కుక్క వచ్చింది. దీంతో దాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ కారును పక్కకు తిప్పగా.. కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. అందులోని రామయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. రామయ్యను ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందారని అక్కడి వైద్యులు చెప్పినట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మాధవరెడ్డి తెలియజేశారు.

భారీగా మద్యం పట్టివేత

చిన్నంబావి: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లిలో రూ.4లక్షల విలువగల 47 కాటన్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దగడపల్లికి చెందిన వెంకట్రావు ఇంట్లో 29 కాటన్లు, కుమ్మరి రమేష్ ఇంట్లో 3 కాటన్లు, కుమ్మరి శంకరయ్య ఇంట్లో 17 కాటన్ల మద్యం నిల్వ చేయగా, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ కళ్యాణ్, స్పెషల్ పార్టీ పోలీస్ రవినాయక్, వీపనగండ్ల ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

1977లో ఇందిరాగాంధీ ప్రచారం



1977 ఎన్నికల్లో మక్తల్ సెగ్మెంట్ నుంచి ఇందిరా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నర్సింహులు నాయుడు పోటీచేశారు. ఆయన తరఫున దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రచారం నిర్వహించారు. మక్తల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. హిందీలో ఆమె మాట్లాడగా.. రైల్వేశాఖ మాజీ సహాయమంత్రి మల్లికార్జున్ తెలుగులో అనువదించారు. అప్పటి ఎన్నికల్లో హేమాహేమీలపై నర్సింహులు నాయుడు విజయం సాధించి, మక్తల్ చరిత్రను తిరగరాశారు. - మక్తల్

కొల్లూర్‌లో కవ్వింపు చర్యలు

- పోటాపోటీగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నినాదాలు


కొల్లూర్‌లో పోటాపోటీగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కొల్లూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారానికి స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకొని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు సైతం నినాదాలు చేయడంతో గ్రామం మొత్తం దద్దరిల్లింది. ఒక దశలో ఒకరినొకరు తోసుకుంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు పాల్పడే స్థాయికి అక్కడి పరిస్థితి చేరడంతో మండల నాయకులు కలుగజేసుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కాగా ఎలాంటి గొడవ జరగకుండా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.